137) సాళంగనాట/ఆటాణ

ప|| ఇదివో వీధివీధుల నీతనితేరు | యెదుట శ్రీవేంకటాద్రిని తేరు ||

చ|| చట్టువడ దోలె నాడు సముద్రాలపై దేరు | ఘుట్టుగా దోలెను పౌండ్రకునిపై దేరు |
జట్టిగొని తోలె జరాసంధునిపై నదె తేరు | కొట్టి తోలె హంసడి భక్తులపై తేరు ||

చ|| ఘోరమై కుంగగ దోలె కులగిరులపై దేరు | కౌరవసేనపై దోలె గక్కన దేరు |
కోరి మధురమీద నక్రూరు గూడి తోలె దేరు | ఆరసి సందిమాటలు ఆడదోలె దేరు ||

చ|| తచ్చి శిశుపాలాది దైత్యులపై దోలె దేరు | పెచ్చుగా దోలె రుక్మిణిపెండ్లితేరు |
అచ్చపు శ్రీవేంకటేశు డలమేలుమంగ గూడి | చెచ్చెర దోలె దిక్కుల సింగారపు దేరు ||